| Article Date | Headline / Summary | Publication |
| --- | --- | --- |
| 12 Dec 2024 | Disclosure of diseases is mandatory in health insurance | Andhra Prabha |

# ఆరోగ్య బీమాలో వ్యాధుల వెల్లడి తప్పనిసరి

**ముంబై :** హెల్త్ ఇన్సూరెన్స్‌లో ముందు నుంచి ఉన్న వ్యాధులు (పీఈడీలు) అనే పదం ఒక వ్యక్తి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడానికి ముందు రోగనిర్ధారణ చేసిన లేదా కనిపించేన ఏదైనా పరిస్థితి, అనారోగ్యం లేదా గాయాలను సూచిస్తుంది. ముందు నుంచి ఉన్న వ్యాధులు అనేవి హెల్త్ ఇన్సూరెన్స్ రంగంలో కీలక అంశమని బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అడ్మినిస్ట్రేషన్ టీమ్ హెడ్ భాస్కర్ నేరుర్కర్ అభిప్రాయపడ్డారు. ఇవి ఇన్సూరర్లు రిస్క్‌ను ఎలా అంచనా వేస్తారు,ర ఆరోగ్య కవరేజ్ నిబంధనలను ఎలా నిర్ణయిస్తాయి అనే దానిపై నేరుగా ప్రభావం చూపుతాయని ఆయన వివరించారు.

ముందునుంచి ఉన్న వ్యాధుల గురించి తెలియచేయడం ముఖ్యమన్న విషయం అర్థం చేసుకోవాలి. ఇలా ప్రకటించకుంటే క్లెయిమ్ ప్రాసెస్ సమయంలో సమస్యలకు దారితీయవచ్చు. క్లెయిమ్ తిరస్కరణకు, పాలసీ రద్దు కూడా ఇది దారితీస్తుందని భాస్కర్ నేరుర్కర్ పేర్కొన్నారు.

## ముందు నుంచి ఉన్న వ్యాధులు అంటే

హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ఒక వ్యక్తికి ఉన్న ఆరోగ్య పరిస్థితి. డయాబెటిస్, హైపర్‌టెన్షన్ (బీపీ), ఆస్తమా వంటి దీర్ఘకాలిక వ్యాధులు, హాస్పిటలైజేషన్ అవసరమైన గతంలో జరిగిన ఆపరేషన్లు లేదా అనారోగ్యాల వంటివి ఉంటాయి. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) మార్గదర్శకాల ప్రకారం ముందు నుంచి ఉన్న వ్యాధుల్లో ఇన్సూరెన్స్ పాలసీని కొనుగోలు చేయడానికి ముందు 48 నెలల్లో రోగనిర్ధారణ చేసిన లేదా చికిత్స చేసిన ఏదైనా వైద్య పరిస్థితి ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడానికి రెండు సంవత్సరాల ముందు హైపర్‌టెన్షన్‌తో రోగనిర్ధారణ చేయబడితే అది ముందు నుంచి ఉన్న పరిస్థితిగా వర్గీకరించబడుతుంది. మూడు సంవత్సరాల క్రితం ఏదైనా ఆపరేషన్ చేయించుకున్నా అది కూడా ముందు నుంచి ఉన్న వ్యాధుల జాబితాలో వస్తుంది. ఒక వ్యక్తి 10 సంవత్సరాల క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించుకుంటే, గత 48 నెలల్లో ఎలాంటి అసౌకర్యాన్ని ఎదుర్కొకపోయినా, మందులు తీసుకోకపోయినా, ఆరోగ్య ప్రమాదానికి చెల్లింపు హామీ పొందడానికి అది ముందు నుంచి ఉన్న పరిస్థితిగా పరిగణించబడదు.

### వెయిటింగ్ పీరియడ్..

చాలా వరకు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో ముందు నుంచి ఉన్న వ్యాధుల కోసం వెయిటింగ్ పీరియడ్ ఉంఉంది. ఈ పరిస్థితులకు సంబంధించిన క్లెయిమ్‌లను కవర్ చేయబడకపోవచ్చు. లేదా పాక్షికంగా కవర్ చేయబడవచ్చు. ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాల ప్రకారం 2024 ఏప్రిల్ నుంచి ముందు నుంచి ఉన్న వ్యాధుల కోసం వెయిటింగ్ పీరియడ్ 3 సంవత్సరాలు. పాలసీలో ప్రకటించిన వ్యాధులకు మూడు సంవత్సరాల తరువాత మాత్రమే క్లెయిమ్ చేసుకోవచ్చు.

ముందు నుంచి ఉన్న వ్యాధుల జాబితాలో డయాబెటిక్, హైపర్‌టెన్షన్, హైపర్‌లిపిడేమియా, గుండె వ్యాధులు, అస్థమా, థైరాయిడ్ రుగ్మతలు వంటివి ఉన్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకునే ముందు నుంచి ఉన్న వ్యాధుల వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. ఇలా చేయకుంటే క్లెయిమ్ తిరస్కరణకు గురికావచ్చు. ఇన్సూరర్ ఇలా ముందు నుంచి ఉన్న వ్యాధులను వెల్లడించకుంటే పాలసీని రద్దు చేయవచ్చు. ఇలాంటి సమయంలో భవిష్యత్‌లోనూ హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడం కష్టంగా మారుతుంది. మెరుగైన కవరేజీ కోసం ముందు నుంచి ఉన్న వ్యాధులను ప్రకటించడం ద్వారా పాలసీదారుడి పారదర్శకతను నిర్ధారిస్తారు. ఇది విశ్వసనీయమైన కవరేజీని అందించేందుకు ఉపయోగపడుతుంది.




అనేక ఇన్సూరెన్స్ సంస్థలు వీటిని పరిగణలోకి తీసుకుని నిర్దిష్టమైన రైడర్లు, మెరుగైన కవరేజీ ప్లాన్లను అందిస్తాయి. ఇన్సూరెన్స్ అప్లికేషన్స్‌లో తప్పుడు సమాచారం అందించడం ఒప్పందం ఉల్లంఘన, చట్టపరమైన సమస్యలకు దారితీస్తుంది.

హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తున్న చాలా సంస్థలు వ్యాధుల నివారణ కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు. సాధారణ వైద్య పరిస్థితులతో కస్టమర్లకు ఉచిత తనిఖీలు ఏర్పాటు చేస్తున్నాయి. కస్టమర్లకు వెల్‌నెస్ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే సమయంల ముందు నుంచి ఉండే వ్యాధుల గురించి అడుగుతారు. ఇలాంటి సందర్భం లో పూర్తి వివరాలు వెల్లడించడం మంచిది. ఈ సమయంలో అవసరమైతే వైద్య పరీక్షల రిపోర్టులను కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు కోరవచ్చు. ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లో ముందు నుంచి ఉన్న వ్యాధుల వెల్లడి కీలక పాత్ర పోషిస్తాయి. అధిక ప్రీమియం, వెయిటింగ్ పీరియడ్‌ను నివారించడానికి వీటిని దాచడం సరికాదని, వాటిని వెల్లడించాలని భాస్కర్ నేరుర్కర్ సూచించారు.